



వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి-నెల్లూరు: గడచిన కొద్ది రోజులుగా నగరంలో ప్రశాంతతకు భంగం కలిగే విధంగా పలు ఘటనలు చోటు చేసుకున్న నేపథ్యంలో పోలీస్ ఉన్నతాధికారులు ఇద్దరు సిఐలపై వేటు వేశారు. పై అధికారుల నుంచి జిల్లా అధికారులకు హెచ్చరికలు వచ్చిన నేపథ్యంలో గడిచిన రెండు రోజుల నుంచి నగర ప్రధాన కూడళ్లలో వాహన తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఎస్‌పి జి.కృష్ణకాంత్, ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్‌పి (అడ్మిన్) సూచనల మేరకు, టౌన్ డిఎస్‌పి ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్ , నంబర్ ప్లేట్ లేని వాహనాల తనిఖీ చేపడు తున్నారు. కొందరి యువకుల వద్ద కత్తులు, మారణాయుధాలు దొరకడంతో వారిని అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరు పరిచారు. నగర డిఎస్‌పి సింధుప్రియ మీడియాతో మాట్లాడుతూ వాహన తనిఖీలు చేసే సమయంలో ఎవరైనా కత్తులు, మారణాయుధాలు దొరికితే జైలుకే...పోలీసులు గుర్తించినా అటువంటి వారిని కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న దృశ్యం

బాబు మాటలు..నీటి మూటలు..!

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాటలు కోటలు దాటుతున్నాయి.. ఆచరణ గడప దాటడం లేదు..ఎనిమిది నెలల క్రితం ముఖ్యమంత్రి, ఇరిగేషన్ శాఖ మంత్రి స్వయంగా వచ్చి హామీ ఇచ్చినా ఇప్పటికీ ఆపని ముందుకు సాగడం లేదు..సోమశిల ప్రాజెక్టుకు కేంద్రమైన ఆప్రాన్ నిర్మాణం, ఇతరుల కోసం రూ.100 కోట్ల నిధులు ఇస్తామని, రెండు నెలల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు..ఎనిమిది నెలలు గడిచిపోతున్నా ఇప్పటి వరకు కేవలం రూ.5.76 కోట్ల నిధులు మాత్రమే ఖర్చు చేశారు..ఈ బిల్లుల కోసం పనిచేసిన కాంట్రాక్టర్ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.. సోమశిల ప్రాజెక్టు గేట్లు, రోప్స్, ఆప్రాన్ మొత్తం దెబ్బతింది. వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా సోమశిల ప్రాజెక్టు ప్రమాదంలో పడిందని కూటమి నేతలు ప్రచారం చేశారు.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అదే చేస్తున్నట్లు కనిపిస్తోంది.. పాలకుల నిర్లక్ష్యానికి సోమశిల ప్రాజెక్టు సాక్షంగా కనిపిస్తోంది. రెండో పంటకు మే5 నుంచి నీరు విడుదల చేయడానికి ఐఎబి తీర్మానించింది.. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారో చూడాలి..

- -రూ.100 కోట్లకు హామీ...రూ.5.76 కోట్లు పని
- -బిల్లులు కోసం కాంట్రాక్టర్ల పడిగాపులు
- -8 నెలల కిందట ఆప్రాన్ నిర్మాణ హామీ
- -మే 5న సోమశిల నీరు విడుదల

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి నెల్లూరు జిల్లాకు సోమశిల, కండలేరు ప్రాజెక్టులు జిల్లాకు వరం. జిల్లా రైతాంగం సాగునీటి, ప్రజల తాగునీటి సమస్యలు తీరుతున్నాయి. ప్రస్తుతం సోమశిల 78 టిఎంసిల సామర్థ్యంతో ఉంది. కండలేరులో 68 టిఎంసిలు. ప్రతేడాది సెప్టెంబర్, అక్టోబర్‌లలో భారీ వర్షాలు, వరదలొస్తాయి. సోమశిలకు 12 గేట్లు ఉన్నాయి భారీగా వర్షాలు వచ్చినప్పుడు అన్ని గేట్లు తీసి పెన్నాకు నీరు విడుదల చేస్తున్నారు.. 2022లో ఏకంగా ఐదు లక్షల క్యూసెక్కులు నీరు సోమశిల నుండి కిందకు విడుదల చేశారు. ఈ సమయంలో ప్రాజెక్టు ముందుభాగంలో ఆప్రాన్ పూర్తిగా దెబ్బతింది. పెన్నా పరివాహక ప్రాంతంలో వరద నీరు వచ్చి భారీగా నష్టపోయారు. అటు తరువాత అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆప్రాన్ నిర్మాణానికి రూ. 98 కోట్లతో టెండర్లు పిలిచారు. కాంట్రాక్టర్లు సుమారు రూ.22 కోట్లు విలువైన పనులు చేశారు. ప్రాజెక్టు ముందు భాగాన సిమెంట్, కమ్మితో కొంత పనులు చేశారు. బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు సగంలోనే నిలిపేసి వెళ్లిపోయారు. ప్రాజెక్టు బలంగా ఉండాలంటే కీలకమైనది ఆప్రాన్, డ్యామ్ ముందుబాగాన బలంగా నిర్మాణం చేస్తారు. ఇనుము, కాంక్రీట్ తో నిర్మాణం చేస్తారు. గేట్లు ద్వార నీరు కిందకు వదిలినప్పుడు ఇసుక, మట్టి కొట్టుకుపోకుండా ఆప్రాన్ నిర్మాణం నిలుపుదల చేస్తుంది. ఇదే ఇప్పుడు ప్రమాదంగా మారింది. దీనిని పూర్తిగా నిర్మాణం చేయకపోతే ప్రాజెక్టు ఉనికే ప్రమాదం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జిల్లాకు చెందిన నాయకులు సోమశిల ప్రాజెక్టు పరిస్థితిని వివరించడానికి మంత్రులు, ఎంపిలు, ఎంఎల్ఎలతో జూలై 13న రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సోమశిల, కండలేరు ప్రాజెక్టులకు సందర్శించారు. ఆప్రాన్ నిర్మాణం, తుప్పుపట్టిన గేట్లు, రోప్‌లు చూసి చలించిపోయారు. వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. వెంటనే నిధులు విడుదల చేస్తున్నామని, వెంటనే పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గేట్లు మరమ్మతులకు రూ. 2.5 కోట్లు, ఆప్రాన్‌కు రూ.80 కోట్లు, కండలేరు ప్రాజెక్టుకు రూ. 16 కోట్లు అవసరం ఉందని చెప్పారు. ఆగస్టు 18న సోమశిల గ్రామంలో ముఖ్య మంత్రి ఎన్. చంద్రబాబునాయుడు ప్రజావేదిక నిర్వహి ంచారు. అక్టోబర్‌లోపు ఆప్రాన్ పూర్తి చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. స్వయంగా ముఖ్యమంత్రి, ఇరిగేషన్ శాఖ మంత్రి వచ్చి హామీ ఇచ్చారు. ఇక పని అయిపోయినట్లే అన్నట్లు రైతులు సంబర పడిపోయారు.

రూ.100 కోట్లకు హామీ..
చేసిన పని రూ.5.76 కోట్లు..!

సోమశిల ప్రాజెక్టు జిల్లా సాగు, తాగునీటి అవసరాలను తీర్చే కేంద్రం. కాంగ్రెస్‌పార్టీ శంకుస్థాపన చేసింది. ఎన్‌టి రామారావు దీనిని ప్రారంభించారు. కండలేరు ప్రాజెక్టు ఏర్పాటు సాగింది. సోమశిల ప్రాజెక్టుకు 12 గేట్లు ఉన్నాయి.



ప్రాజెక్టు వద్ద దెబ్బతిన్న అప్రాన్

వీటికి నిత్యం గ్రీస్ పూయడంతోపాటు, మరమ్మతులు చేయాల్సి ఉంటుంది. వైసిపి ప్రభుత్వంలో ఐదేళ్లపాటు ఒక్క



సోమశిల ప్రాజెక్టు

రూపాయి గేట్లు మరమ్మతుల కోసం ఇవ్వలేదు.. ఈ నేపథ్యంలో అనేక చోట్ల గేట్లు తుప్పుపట్టి , ఇనుప రోప్స్ దెబ్బతిన్నాయి. అప్పడప్పుడు గ్రీస్ వినియోగించి గేట్లు తీయాలి. నెలలు, సంవత్సరాలు ఆ పని చేయలేదు. దీంతో ప్రాజెక్టులోని అనేక గేట్లు రోప్స్‌కు తుప్పు పట్టింది. ఇదే విషయాన్ని అధికారులు ప్రభుత్వానికి తెలిపారు. వెంటనే మరమ్మతులు చేసి, అప్రాన్ నిర్మాణంతోపాటు, గేట్లు, రోప్స్ మరమ్మతులు చేయాల్సి ఉంది. లేదంటే పెను ప్రమా దమేనని నిపుణలు హెచ్చరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆప్రాన్ నిర్మాణం కోసం రూ.99 కోట్లతో టెండర్లు పిలిచారు. రూ.21 కోట్లు విలువైన పనులు చేశారు. బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు వెళ్లిపోయారు. రూ.80 కోట్లు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పనులకోసం సిఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆగస్టు 18న యుద్ధ ప్రాతిపదిక పనులు చేస్తామని ప్రకటించారు. ఇప్పటి వరకు కేవలం రూ.5.76 కోట్లు పనులు మాత్రమే పూర్తి చేశారు. కాంట్రాక్టర్లకు ఆ నిధులు రాక అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఇటీవల బడ్జెట్‌లో ఆప్రాన్ నిధుల ప్రస్తావనే కనిపించలేదు. స్వయంగా సిఎం ఆశాఖ మంత్రి హామీ ఇచ్చినా ఇప్పటికీ అతీగతి లేదు. మే 5న సోమశిల నుంచి నీటిని విడుదల చేయాలని ఐఎబి తీర్మానించింది. చంద్రబాబు మాటలు నీటి మూటలే అంటూ రైతులు చెవులుకొరుక్కుంటున్నారు. సోమశిలకు పూర్తి స్థాయిలో నీరు వచ్చి కిందకు 12 గేట్లు నీళ్ళ వదిలితే ప్రాజెక్టు ఉనికికే ప్రమాదం పొంచి ఉంది. ఏం చేస్తారో చూడాలి...

'వక్ఫ్' చట్ట సవరణ
లౌకిక రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-నెల్లూరు

భారత దేశ లౌకిక రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించే విధంగా కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌చట్ట సవరణ చేయడం తగదని, తక్షణమే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు అభిప్రాయ పడ్డారు. శనివారం వక్ఫ్ చట్ట సవరణను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో డాక్టర్ జెట్టిశేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, కాంగ్రెస్ , పలు ప్రజా సంఘాలు సంయుక్త ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. మాజీ శాసనమండలి సభ్యులు విఠపు బాలసుబ్రమణ్యం సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్,కాంగ్రెస్ నగర అధ్యక్షుడు ఫయాజ్, నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి,సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్,సిపిఐ జిల్లా సీనియర్ నాయకులు వి.రామరాజు తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ సవరణ ద్వారా బిజెపి ప్రభుత్వం ప్రజలను చీల్చడానికి ఉద్దేశించిన తన హిందుత్వ ఎజెండాను ముందుకు తెస్తుందన్నారు. ముస్లిములు విచ్చల విడిగా భూములను ఆక్రమించుకున్నట్లు చెప్పడానికి గత చట్టాన్ని ఉపయోగించుకున్నారంటూ పదే పదే చెబుతోందని, వక్ఫ్ ఆస్తుల నిర్వహణ నుంచి ముస్లిమేతరులను తొలగించాలని ఇస్లామిక్ ఆదేశాలు ఉన్నప్పటికీ సవరించిన చట్టం ముస్లిమేతరులను వక్ఫ్ బోర్డుల్లో చేర్చిందన్నారు. ఇది మతాన్ని ఆచరించుకునే ముస్లింలకు గల రాజ్యాంగ హక్కుపై దాడి చేయడమేనన్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న వక్ఫ్ సవరణ చట్టంలో సోదర భావం, సౌభ్రాతత్వం ప్రదర్శించడం సాధ్యం కాదన్నారు. వక్ఫ్ ఆస్తులను నిర్ణయించే అధికారాన్ని సర్వే కమిషనర్ నుంచి ప్రభుత్వం నియమించిన రెవెన్యూ అధికారులకు బదిలీ చేయడం ద్వారా ఆరాధనా స్థలాలు, విద్యా సంస్థలు, ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు, వత్తివిద్యా కేంద్రాలను స్వాధీనం చేసుకోవాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా ఉందన్నారు. తద్వారా వక్ఫ్ ఆస్తులపై పట్టును కేంద్ర ప్రభుత్వం మరింత పెంచుకోనుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. లౌకికవాదులు, ప్రజాస్వామ్య భావజాలం కలిగిన పౌరులందరూ ఈ వివక్షపూరితమైన వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఒక్క తాటిపైకి కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం, సిపిఐ,సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజా సంఘాల ,ఉద్యోగ,ఉపాధ్యాయ, న్యాయవాదుల సంఘాల నాయకులు,ప్రముఖులు పాల్గొన్నారు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

విపిఆర్ జన్మదినోత్సవం.. భారీ రక్తదాన శిబిరం

ఒకేరోజు 1260 యూనిట్ల సేకరణ

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి :నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జన్మదినోత్సవ వేడుకలు జిల్లా వ్యాపితంగా ఘనంగా నిర్వహిం చారు. శనివారం ఉదయం స్థానిక విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన మెగా రక్తదానం ఏర్పాటు చేశారు. . వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యువత విపిఆర్ కోసం రక్తదానం చేసేందుకు పోటీ పడ్డారు. ముఖ్యంగా కోవూరు నియోజకవర్గం నుంచి భారీస్థాయిలో నాయకులు, కార్యకర్తలు, యువకులు హాజరయ్యారు. ఒక రోజు రక్తదాన శిబిరంలో ప్రముఖ రెడ్‌క్రాస్ సొసైటీ, ప్రభుత్వ సర్వజనాస్పత్రి, నోవా బ్లడ్ బ్యాంక్, నారాయణ హాస్పిటల్స్ ఈ మెగా రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. దాదాపు ఒకరోజే 1260 యూనిట్ల రక్తం సేకరించారు. ఎంపి వేమిరెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా యువతే కాదు.. నేతలు కూడా రక్తదానం చేసేందుకు క్యూ కట్టారు. టీడీపీ ముఖ్య నాయకులు దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చెముకుల కృష్ణ చైతన్య, కోడూరు కమలాకర్‌రెడ్డి, బెజవాడ వంశీరెడ్డి, ఇంతా మల్లారెడ్డి, వీరేంద్ర నాయుడు, గుడి హరిరెడ్డి, జొన్నవాడ ఆలయ మాజీ ఛైర్మన్ పుట్టా సుబ్రహ్మన్యం నాయుడుతో పాటు ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేసి యువతకు ఆదర్శంగా నిలిచారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ వాకాటి విజయ్ ఽకుమార్ రెడ్డి స్వయంగా రక్తదాన శిబిరంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. రక్తదానం చేసినవారికి ధ్రువీకరణ పత్రాలు అందించారు.



విపిఆర్ భర్తడే సందర్భంగా రక్తదానం చేస్తున్న యువత

ఐఐటి, జెఇఇ మెయిన్స్ ఫలితాలలో

'కృష్ణ చైతన్య' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -నెల్లూరు డెస్క్ :ఐఐటి, జెఇఇ మెయిన్స్ ఫలితాలలో కృష్ణచైతన్య విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు.కళాశాల విద్యార్థి నిర్మల్ తేజ జాతీయ స్థాయిలో 274 వ ర్యాంక్ సాధించినట్లు కళాశాల డైరెక్టర్లు తెలిపారు. జె.ఇ.ఇ (మెయిన్స్) ఫలితాలలో కష్ణచైతన్య కళాశాల ఐన్ స్టీన్ క్యాంపస్ విద్యార్థులు జాతీయ స్థాయిలో అద్భుత పర్సంటైల్స్, ర్యాంకులను సాధించి కళాశాలను అగ్రభాగాన నిలబెట్టారని తెలిపారు. ఈ ఫలితాల నుంచి ఐఐటి జెయిఇ అడ్వాన్స్‌కు కు 40 మంది అర్హత సాధించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను వారు అభినందించారు.



వర్ల రామయ్యకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కందుకూరు : టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్యను తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల కమిటీ చైర్మన్ గా నియమించిన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడుకు , ఐటి శాఖ, మానవ వనరుల అభివద్ధి శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ బాబు కు నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే ధన్యవాదాలు తెలియజేసినట్లు తెలిపారు. తాడేపల్లిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో శనివారం వర్ల రామయ్యను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే , ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోన ప్రతాప్ , ఉలవపాడు మండలం తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం నవీన్ తదితరులు ఉన్నారు.



కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-కందుకూరు : సామ్రాట్ అశోక 2329వ జయంతి సభలో బుద్ధిష్టులు, అంబేద్కర్టిలు, మానవతావాదులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలనీ బుద్ధ విహార ట్రస్ట్ అధ్యక్షులు అల్లు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు గాండ్ల హరిప్రసాద్, జాషువా సాహిత్య సాంస్కతిక సంస్థ అధ్యక్షులు ముప్పవరపు కిషోర్, ప్రధాన కార్యదర్శి చనమాల కోటేశ్వరరావు లు తెలిపారు. అంబేద్కర్ కు బౌద్ధ తాత్వికత, అశోకుని శాసనాల ,సంస్కతి ద్వారా అందినది. అందుకే ప్రజాస్వామ్యయుతమైన ఆధునిక భారత రాజ్యాంగ రూపొందుటకు మూలపురుషుడైన అశోకుని జయంతిని ఈనెల 20 తేదీ ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు శింగరాయకొండ మెయిన్ రోడ్డులోని పాకల జంక్షన్ దగ్గర గల ధమ్మచక్ర బుద్ధ విహార కార్యాలయంలో జరుగుతుందని తెలిపారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కందుకూరు :మే 15 న తిరుపతిలో జరిగే ఎఐవైఎఫ్ 17వ జాతీయ మహా సభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మున్నా పిలుపునిచ్చారు. కందుకూరు సిపిఐ కార్యాలయంలో మే 15 న తిరుపతిలో జరిగే ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహా సభ గోడ పత్రికను ఏఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శి చేవూరి దుర్గా ప్రసాద్, బొజ్జా చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మున్నా హాజరై మాట్లాడారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పోకూరు మాలకొండయ్య, నియోజకవర్గం కార్యదర్శి బాబు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి వై ఆనంద్ మోహన్, నాయకులు హరిబాబు, రవి, డి ఆదినారాయణ ఉన్నారు.



బాట సమస్యను పరిష్కరిస్తాం..

ప్రజాశక్తి - గుడ్లూరు రూరల్ :మండలంలోని పూరేటిపల్లి గ్రామానికి చెందిన రైతు పూర్వం నుంచి రెవెన్యూ రికార్డులు పరంగా బండ్ల బాటను అడ్డుకని ఎగువ పొలాలకు వెళ్లే రైతులకు వీలు లేకుండా ఆటంకం కలిగించాడు. దీంతో సమస్యను అర్జీ రూపంలో గుడ్లూరు తహాశీల్దార్, కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ దష్టికి గ్రామానికి చెందిన 20 మంది రైతులు తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో తహసిల్దార్ జి .స్వర్ణ శనివారం పురేటిపల్లి గ్రామానికి వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు.బాటను ఆక్రమించి పత్తి పంటను సాగు చేస్తున్న టువంటి రైతులకు నోటీసులు జారీ చేసి త్వరలో సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీనిచ్చారు.



సమస్యను తెలుసుకుంటున్న తహశీల్దార్

స్వచ్ఛపాలన కూటమి ప్రభుత్వ లక్ష్యం

మంత్రి పొంగూరు నారాయణ - పలుచోట్ల ఈ- వ్యర్థాలు సేకరణ



ప్రజాశక్తి-నెల్లూరు :స్వచ్ఛమైన మనసుతో స్వచ్ఛమైన పాలన అందించేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుందని, రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర -స్వచ్చాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంత్రి నారాయణ ఆధ్వర్యంలో దాదాపు 5,000 మంది విద్యార్థులు, వివిధ వర్గాల ప్రజలతో నెల్లూరు నగరంలోని వి ఆర్ సి సెంటర్ నుండి నర్తకి సెంటర్ వరకు భారీ స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. "ఈ - వేస్ట్ దహనం కాదు నిర్వహణ కావాలి, ప్లాస్టిక్ వాడకం తగ్గించండి, ఈ - వేస్ట్ ను మిగతా చెత్తతో కలప వద్దు, వాతావరణ కాలుష్యాన్ని అరికట్టండి - ప్రకతిని రక్షించండి " వంటి నినాదాలతో విద్యార్థులు కదం తొక్కారు. వేలాదిగా హాజరైన విద్యార్థులు, ఇతరులతో మంత్రి నారాయణ స్వచ్చతా ప్రతిజ్ఞ చేయించారు.నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, డిప్యూటీ చైర్మన్ రూప్ కుమార్ యాదవ్, నగర పాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ వైఓ నందన్ ఉన్నారు.మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ శనివారం అల్లిపురం డంపింగ్ యార్డ్ ను సందర్శించారు. జిగ్మా గ్లోబల్ ఎన్విరాన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఏర్పాటుచేసిన బయో మైనింగ్ యూనిట్ ప్రక్రియ ద్వారా డంపింగ్ యార్డ్ లో చెత్తను వేరు చేసే యంత్రాన్ని మంత్రి స్విచ్ నొక్కి ప్రారంభించారు. స్వచ్ఛ్ ఆంధ్ర కార్పొరేషన్ ఎండి అనిల్ కుమార్ రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ చైర్మన్ కష్ణయ్య, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, నెల్లూరు నగర కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ డిప్యూటీ మేయర్, నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ వైఓ నందన్ ఉన్నారు.

ఎస్‌పి కార్యాలయంలో ..ప్రతి నెల మూడో శనివారం పర్యావరణ పరిరక్షణ కోసం, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన " స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర " కార్యక్రమం ఎస్‌పి కార్యాలయంలో నిర్వహించారు. ఇ-వ్యర్థాలు శాస్త్రీయ పద్ధతిలో ఎలా డిస్పోజ్ చేయాలనే అంశంపై ప్రతిజ్ఞ, అవగాహన కార్యక్రమం నిర్వహించిన అనంతరం ర్యాలీ నిర్వహించి పలు నినాదాలు చేశారు.

ప్రజాశక్తి -గుడ్లూరు : స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం దగ్గర ఈ వ్యర్థాలు విసర్జించడంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం దగ్గర నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ వ్యర్థాల వల్ల కలిగే అనారోగ్య సమస్యల నుంచి బయటపడేందుకు ఆరోగ్యాన్ని సంరక్షించేందుకు వెంటనే ఈ వ్యర్థాలు రీసైక్లింగ్ కోసం వేయాలని ఎంపిడిఓ వై వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఎస్ఐ వెంకట్రావు, తహశీల్దార్ జి స్వర్ణ,ఎఓ రవికుమార్, ఎపిఓ వెంకటేశ్వర్లు, ఎపిఎం చిన్న ఐసిడిఎస్ సూపర్వైజర్స్ నాగలక్ష్మి కామేశ్వరి వీఆర్వో చలమారెడ్డి గుడ్లూరు పంచాయతీ ఇంచార్జి కార్యదర్శి నరేష్ సర్పంచ్ పాలకుర్తి శంకర్ ఉన్నారు.



గుడ్లూరులో..

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూరు మున్సిపాలిటీని స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దటమే తన లక్ష్యమని ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు.కందుకూరు పట్టణంలోని 15వ వార్డు లో శనివారం ఉదయం అజ్మల్ హుస్సేన్ హాస్పిటల్ ఏరియాలో జరిగిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ తో కలిసి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ స్వర్ణాంధ్రగా మన రాష్ట్రాన్ని తీర్చిదిద్దడం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు.. ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు.ముందుగా కందుకూరు పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ వాహనాన్ని సబ్ కలెక్టర్ శ్రీసూజ తో కలసి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు .కమిషనర్ కె అనూష మున్సిపల్ డి ఈ గణపతి, కందుకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య, ఉప్పుటూరి శ్రీనివాసరావు, వార్డు అధ్యక్షుడు షేక్ ఖలీల్, సలాం, పబ్బిశెట్టి వరదరాజ, భాష, గౌస్, రసూల్, సుభాని చదల వాడ కొండయ్య, చిలకపాటి మధుబాబు, షేక్ రఫీ, బెజవాడ ప్రసాద్, వడ్డెళ్ళ రవిచంద్ర, ఎం శ్రీనివాసరావు, రావి వెంకటేశ్వర్లు ఉన్నారు.



చీపురు పట్టి రోడ్లు ఊడుస్తున్న ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు

టిఆర్ఆర్ కళాశాలలో.. టిఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం "ఇ-చెక్" అనే ఇతివత్తంతో, నేషనల్ సర్వీస్ స్కీమ్, కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. ఏడుకొండలు నరేంద్ర మాట్లాడారు. అకడమిక్ కోఆర్డినేటర్ డా.ఎన్.వి.శ్రీహరి మాట్లాడుతూ దైనందిన జీవితంలో మనలో ప్రతి ఒక్కరూ వినియోగించే సెల్ ఫోన్లు, అవి పాడైపోయిన తర్వాత వాటిని పడేయడం వల్ల వాటి బ్యాటరీలు విచ్ఛిన్నం కావడం వలన అవి పర్యావరణంలో, నేలలో కలిసి, జీవరాశులకు హాని చేస్తున్నాయని, విద్యార్థులు వీటి పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ పి రాజగోపాల్ బాబు, ఎన్.ఎస్.ఎస్ , స్వచ్ఛాంధ్ర కోఆర్డినేటర్ కోటపాటి నరేష్ రాజా, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ .జె.హనుమంతరావు ఉన్నారు.

ప్రత్యేక విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి -సైదాపురం : మండలంలోని హరిజనవాడలో చర్చి వద్ద విధ్యుత్ స్తంబానికి రెండు ఎల్ ఈడి, లైట్ లు ఉండడంతో స్థానిక ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు అధికారులు నిర్లక్ష్యం వైఖరి పట్టపగలే వీధి దీపాలు వెలుగుతూ వారి నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్నాయి. దీంతో విలువైన విద్యుత్ వృథా అవుతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీధి దీపాల నిర్వహణలో ఉన్న సమస్యలను విద్యుత్ సిబ్బంది పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు వీధి దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా వెలుగుతుండడంతో వందలాది యూనిట్లు విద్యుత్ వథా అవుతున్నది.ఫలితంగా విద్యుత్ శాఖ గ్రామ పంచాయతీలు తీవ్రంగా నష్టపోతున్నాయి అధికారులు స్పందించి గ్రామాలలో వీధిలైట్లకు ప్రత్యేక లైన్ ఏర్పాటు చేసి ఆన్ ఆఫ్ స్విచ్‌లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రికార్డులు పరిశీలన

ప్రజాశక్తి -గుడ్లూరు :గహ నిర్మాణ శాఖ డిఇ జహీరుద్దీన్ గుడ్లూరు లోని గహ నిర్మాణ శాఖ కార్యాలయాన్ని శనివారం తనిఖీ చేశారు రికార్డులు పరిశీలించాడు. లబ్ధిదారులకు ఇవ్వకుండా ఆపివేసిన 20 టన్నుల స్టీల్, సిమెంట్‌ను పరిశీలించారు. అనంతరం స్థానిక అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గూడెంలో నిల్వ ఉన్న స్టీలు సిమెంటు లబ్ధిదారులకు వెంటనే అందించాలని ఆదేశించారు. గహ నిర్మాణ శాఖ గుడ్లూరు ఎఈ వెంకటేశ్వర్లు, ఉలవపాడు గౌస్ బాషా వివి పాలెం ఎఈ నాగరాజు ఉన్నారు.

ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు వైసిపికి లేదు..

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు వైసిపికి లేదని జనసేన పార్టీ సీనియర్ నేత, కోర్ కమిటీ సభ్యుడు నూనె మల్లికార్జున యాదవ్ అన్నారు. టిడ్కో వేములపాటి అజయ్ కుమార్ సూచన మేరకు శనివారం ఆయన స్థానిక 50 డివిజన్లోని నాయకులు పేటలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా నూనె మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అక్రమాలు, అన్యాయాలు యథేచ్ఛగా జరిగాయని గుర్తు చేశారు. అలాంటి వాటికి చరమగీతం పాడి కూటమి ప్రభుత్వం ప్రజా రంజిక పాలన సాగిస్తుందని తెలిపారు. ముఖ్యంగా తిరుపతి గోశాల విషయంలో వైకాపా రాద్ధాంతం చేయడం సిగ్గుచేటన్నారు. గత ప్రభుత్వం తిరుమల లో అనేక అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. ఇలాంటి వ్యక్తులు కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడం బాధాకరమన్నారు. ముఖ్యంగా మాజీ మంత్రి రోజా నోటికి అడ్డూ అదుపు లేకుండా పోతుందని మండిపడ్డారు. ఆమెది తిరుమల టికెట్లు అమ్ముకున్న నీచ చరిత్రని ఆయన నిప్పులు చెరిగారు. అందుకే ప్రజలు డిపాజిట్లు కూడా రాకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుమారుడి విషయంలో కూడా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శలకు దిగారని, ఇలాంటి వ్యక్తులను ఆ దేవుడు కూడా క్షమించడని హెచ్చరించారు. ఇకనైనా వైకాపా నేతలు నోరు అదుపులో పెట్టుకోవాలని, లేకుంటే తగిన గుణపాఠం చెప్తామని మల్లికార్జున యాదవ్ అన్నారు. కార్యక్రమంలో వర్షాచలం రాజేష్, దాసరి పోలయ్య, వెంకట్ తల్లూరి, పవన్ యాదవ్, మహేష్, చంటి, కె శ్రీనివాస్, ప్రసన్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్, జనసేన నాయకులు, వీరమహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనసేన నేత నూనె మల్లికార్జున యాదవ్

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - లింగసముద్రం : మండలంలోని పెద్దపవనిఅంగన్వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి బాలింతలు, గర్భిణీలకు పలు సూచనలు సలహాలు చేశారు. సూపర్‌వైజర్ నీలా ఒబరి మాట్లాడారు.గర్భిణీలు బాలింతలు మంచి పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని చెప్పారు. సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, బాలింతలు, గర్భిణులు ఉన్నారు.

ప్రజాశక్తి గుడ్లూరు రూరల్ : మండలంలోని గుడ్లూరు - 2 సెక్టార్ లోనీ అమ్మవారిపాలెం గ్రామంలోనీ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవం నిర్వహిం చారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఎలా తీసు కోవాలో వివరించారు. అంగన్‌వాడీసూపర్‌వైజర్ కామేశ్వరి, కార్యకర్తలు .డేగ శాంత కుమారి. పాపను పోయిన మాధవి, జనిగర్ల స్రవంతి. తాటిపర్తి శాంతమ్మ ఉన్నారు.

వలేటివారిపాలెం :

పప్పు దినుసులు, చిరుధాన్యాలు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం వల్లనే తల్లులు ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కొత్తూరి సునీత సూచించారు. శనివారం మండలంలోని బడేవారిపాలెంలో ఐసిడిఎస్ సీడీపీఓ శర్మిష్ట సూచనల మేరకు పౌష్టికాహార పక్షోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ సునీత మాట్లాడారు. పాఠశాల ప్రధానోపా ధ్యాయులు మాల కొండయ్య, ఏఎన్‌ఎం లావణ్య, ఆశా లు రమ, రాధ, భారతి, మనోహర్, గ్రామస్తులు పాల్గొన్నారు.



వలేటివారిపాలెంలో..

యానాదులను విస్మరించడం అన్యాయం

- కష్టమే వారికి ఆధార్ కార్డులు కల్పించాలని వినతి



ప్రజాశక్తి-కావలి : తీర ప్రాంత గ్రామాలలో ఎన్నో శాఖల అధికారులు తిరుగుతూ ఉంటారు కానీ యానాదుల వారి కంటికి కనిపించకుండా పోవడం దురదృష్టకర విషయమని, యానాదులకు ఆధార్‌కార్డు లేకుండా అధికారులు విస్మరించడం అన్యాయం! అని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి పేర్కొన్నారు. శనివారం కావలి తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి, తహశీల్దార్ పి.క్రాంత్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి మాట్లాడుతూ తీరప్రాంత గ్రామాలలో ఇప్పటికీ 75శాతం ఆధార్ కార్డులు లేకపోవడం వల్ల వారికి సంక్షేమ పథకాలు రావడం లేదని తెలిపారు. వీళ్ళను కూడా తీసుకోవడం లేదని తెలిపారు. నడిచివెళ్లి యానాదులను తీసుకొని తహశీల్దార్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాలు ఉన్నాయని కాబట్టి ప్రతి ఒక్కరికీ ఆధార్ ఇప్పించాలని తహశీల్దార్ పి.క్రాంత్‌కుమార్ తెలిపినట్లు తెలియజేశారు. కావలి డివిజన్‌లో ప్రతి ఒక్కరికీ ఆధార్ వచ్చే విధంగా కృషి చేస్తామన్నారని తెలిపారు. కార్యక్రమంలో రాపూరు పంతులమ్మ, కత్తి వెంకటరామ, జెడ్డా వాసు, మహిళలు పాల్గొన్నారు.

మెగా కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-వింజమూరు : మండలంలోని పాతూరు ప్రసన్నరెడ్డి నగర్ అయ్యప్ప దేవస్థానంలో గౌరవ నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవస్థానం కమిటీ సభ్యులు, శంకర కంటి ఆసుపత్రి పెదకాకాని గుంటూరు వారి సహకారంతో మెగా కంటి వైద్య శిబిరాన్ని మాజీ సొసైటీ అధ్యక్షులు జూపల్లి రాజారావు చేతుల మీదుగా కేక్ కట్ చేసి ప్రారంభించారు. తదుపరి రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ముందుగా 200 రోగులను పరీక్షించి వారిలో కంటి శుక్లాల ఆపరేషన్లకు 85 మందిని ఎంపిక చేశారు. వారిని రేపు ఉదయం 10 గంటలకు గుంటూరుకు బస్సులో తీసుకెళ్లి ఆపరేషన్లు పూర్తిగా ఉచితంగా చేయిస్తామని దేవస్థాన కమిటీ సభ్యులు తెలియజేశారు. పైకంటి శిబిరాన్ని గౌరవ పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జన్మదిన సందర్భంగా నిర్వహించినట్టు దేవస్థాన చైర్మన్ తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీను, ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ నాగేశ్వరావు, దేవస్థాన కమిటీ సభ్యులు దేవస్థాన చైర్మన్ కరకల మాలకొండారెడ్డి, చేజర్ల వసంతరావు, కొంకల శ్రీనివాసులు రెడ్డి, వెలుగోట్ కృష్ణ పాల్గొన్నారు.

ప్రశ్నించడం మా హక్కు.. : వైసిపి



ప్రజాశక్తి-బిట్రగుంట : ప్రశ్నించడం అనేది భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కల్పించిన హక్కు అని, విలేకరుల సమావేశంలో ప్రశ్నించే వారిని, ప్రభుత్వాన్ని వ్యతిరేకంగా వార్తలు రాసే జర్నలిస్టులపై తప్పుడు కేసులు నమోదు చేయడం సరి కాదని విశ్వనాథరావుపేట బిట్-2 వార్డ్ సభ్యులు ఎ.కె సుందర్ రాజ్ పేర్కొన్నారు. టిడిపి మాజీ ఎంపిటిసి చిలకపాటి వెంకటేశ్వర్లు వైసిపి నాయకులపై చేసిన విమర్శలపై శనివారం బోగోలు వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. మండల అధ్యక్షుడు మద్దిబోయిన వీర రఘు, జిల్లా నాయకులు మేకల శ్రీనివాసులు, వార్డ్ సభ్యులు ఎ కె సుందర్‌రాజ్ మాట్లాడుతూ ఎదుటి వ్యక్తిని మనం ప్రశ్నించేటప్పుడు మనకు అర్హత ఉందా లేదా అని ప్రశ్నించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు వడ్డి అంకయ్య, రమణయ్య, తోటపల్లి సాగర్, మల్లెరెడ్డి, కళ్యాణ్, వేణు, పావయ్య, కిరణ్, కమల్, సుధాకర్, ప్రవీణ్ కుమార్, విజయ్ కుమార్, వెంకయ్య పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్ : చెర్లోయడవల్లిలో డాక్టర్ ప్రమీల మాదమాలతో మాజీ సర్పంచ్ కేతా విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 120మంది రోగులకు పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులను కూడా పంపిణీ చేశారు. ముఖ్యంగా బీపీ, షుగర్ వ్యాధి గ్రస్తులకు మూడు నెలలకు సరిపడా మందులను ఇచ్చారు. మందులను ఆలంబన ఫౌండేషన్ – ఇండియా వారు సరఫరా చేశారు. ఈ శిబిరానికి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అల్లంపాటి రాజేష్ రెడ్డి, ఎఎన్ఎం శంషాద్ బేగం, విలేజ్ పోలీస్ సుప్రజ, ఆశా వర్కర్ కాంతమ్మ, కామిరెడ్డి అశోక్, అంబటి రాధాకృష్ణారెడ్డి సహకారాలు అందించారు.

గౌతు లచ్చన్నకు నివాళులు

ప్రజాశక్తి-కావలి : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, సర్దార్ గౌతు లచ్చన్న 20వ వర్ధంతిని ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు కావలి టిడిపి నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. కావలి పట్టణం మాగుంట పార్వతమ్మ రోడ్డుపై ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆయన స్ఫూర్తితో ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో కావలి టిడిపి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, కావలి రూరల్ మండలం అధ్యక్షులు ఆవుల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఉప్పాల వెంకట్రావు, పట్టణ మహిళ అధ్యక్షురాలు అర్షియా బేగం, నాయుడు రాం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు నిధులు మంజూరు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టిన గృహ నిర్మాణ యజమానులకు వివిధ దశల్లో నిధులు మంజూరయ్యాయని హౌసింగ్ ఎఇ మలినేని వివేక్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణ శాఖ లబ్ధిదారులకు బిసి ఎస్‌సి ఎస్‌టిలు ఇన్ ప్రోగ్రెస్‌లో ఉన్న లబ్ధిదారులకు స్పెషల్ ఎఫ్‌డిఒ కింద కూటమి ప్రభుత్వం రూ.50,000, రూ.70,000 మంజూరు చేశారని తెలిపారు. ఆర్‌సిలో ఉన్నవారు మూడు ఎఫ్‌డిఒలు అమౌంటు రూ.40,000 పడి ఉందన్నారు. కావున ఇంటి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసుకోవాలని, అలాగే ఆర్‌ఎల్, అలాగే ఎల్‌ఎల్, బిఎల్ స్టేజీలో ఉన్న లబ్ధిదారులకు స్టేజిలో ఉన్న లబ్ధిదారులకు ఒకటి రెండు ఎఫ్‌డిఒ కింద రూ.15000, రూ.30,000 వంతున అమౌంట్ పడి ఉంటాయి కాబట్టి వారు కూడా మిగతా నిర్మాణాన్ని చేపడితే మిగతా అమౌంట్ కూడా వారి వారి అకౌంట్లో పడే అవకాశం ఉందన్నారు. ఇంటి నిర్మాణాన్ని త్వరితగతన పూర్తి చేసుకోవాలని తెలియజేశారు.

23లోపు ఈ-కెవైసి పూర్తి చేయాలి

ప్రజాశక్తి-మర్రిపాడు : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం మండలంలోని రేషన్ కార్డు దారులు తప్పక ఈకెవైసి చేసుకోవాలని తహశీల్దార్ అనిల్ కుమార్ యాదవ్ తెలియజేశారు.అలాగే రేషన్ కార్డులో ఉన్న ప్రతిఒక్కరూ రేషన్ షాపు డీలర్ లేదా గ్రామ రెవెన్యూ అధికారి వద్ద ఈకెవైసి పూర్తి చేయనుకోవాలని కోరారు. ఈకెవైసి పూర్తికాని సభ్యుల జాబితాను సంబంధిత రేషన్‌షాపు డీలర్ వద్ద ఉంచారని తెలిపారు. అందుబాటులో లేని వారికి సమీప బంధువులుతో తెలియజేసి వారి ఈకెవైసి ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి-కావలి : సంయుక్త సేవాసంస్థ కార్యాలయంలో చదువు కుంటున్న విద్యార్థులు రెండు రోజుల పాటు బుడంగుంట గిరిజన కాలనీ, పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, అంగన్వాడీ టీచర్లు శారద, మెర్సీ, సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో చదువు కుంటున్న విద్యార్థులు స్వాతి, శివానీ, ప్రణవి, సింధు, మైష, చాందినీ వరలక్ష్మి, స్థానిక మహిళలు పాల్గొన్నారు. అంగన్‌వాడీ టీచర్ శారద మాట్లాడుతూ సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో చదువుకుంటున్న విద్యార్థినిలు చిన్న వయసులోనే సమాజంపై బాధ్యత వహిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు. పిల్లలను సమాజానికి ఉపయోగ పడే విధంగా తీర్చిదిద్దుతున్న సంయుక్త సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆటోడ్రైవర్ సురేంద్రను అభినందించారు.

రోడ్డు నిర్మించరూ..

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం బిట్రగుంట రైల్వే స్టేషన్ నుండి కొత్తూరుకు వెళ్ళు మార్గం గుంతలతో ప్రజలు నరకయాతన అనుభవించారు. బిట్రగుంట రైల్వే ఐఒడబ్ల్యు అధికారి రాజేష్‌కు స్థానికులు పుత్తూరు గ్రామస్తులు సమస్యలు వివరించగా స్పందించిన రైల్వే ఐఒడబ్ల్యు అధికారి రాజేష్ ప్రజలు రైల్వే ఉద్యోగస్తులు పడుతున్న సమస్యను విజయవాడ డివిజన్ రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోగా అధికారులు సానుకూలంగా స్పందించి రోడ్డు నిర్మాణానికి అనుమతులను మంజూరు చేశారు. కొత్తూరు రోడ్డు గత 20 సంవత్సరాలుగా అధ్వానంగా ఉన్న రోడ్డుమార్గం పూర్తి చేసినందుకు రైల్వే ఐఒడబ్ల్యు అధికారి రాజేష్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా స్థానికులు కలిసి ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి సహకరించిన ప్రతిఒక్క రైల్వే ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పోషకాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని డిసిపల్లి సెక్టార్‌లోని పొంగూరు గ్రామంలోని మెయిన్ ఎస్‌సి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సిడిపిఒ పద్మావతి ఆదేశాల మేరకు శనివారం పోషణ్ పక్వాడ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్ సులోచన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లల్లో పోషక ఆహార పదార్థాల గురించి అవగాహన కల్పించడమే పోషణ్ పక్వాడ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఆమె తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ సులోచన, ధనమ్మ, అంగన్‌వాడీ ఆయా, సుబ్బమ్మ, వెంకటమ్మ, చిన్నపిల్లలు, తల్లులు, బాలింతలు, గర్భిణులు, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి



నిరసన చేపడుతున్న వామపక్ష నాయకులు

ప్రజాశక్తి-కావలి : రాజ్యాంగ విరుద్ధమైన వక్ఫ్ చట్ట సవరణను రద్దు చేయాలని కోరుతూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శనివారం ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులైన సిపిఎం నాయకులు పసుపులేటి పెంచలయ్య, సిపిఐ నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, పిడిఎస్ రాష్ట్ర మాజీ నాయకులు కరవది భాస్కర్, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఎల్.లక్ష్మారెడ్డి, ఆర్.ఎస్.పి జిల్లా కార్యదర్శి గోసాల రవికాంత్, తదితరులు మాట్లాడారు. రాజ్యాంగ విరుద్ధమైన వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. వక్ఫ్ బోర్డును నిర్వీర్యం చేయడానికి, ముస్లిం ఆస్తులను బడా కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేయడానికి వక్ఫ్‌బోర్డ్ సవరణ చట్టం తెచ్చారని ఆరోపణ వ్యక్తం చేశారు. తాజా చట్టంలో వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను నియమించడం, వారి భూములకు రక్షణ లేకుండా చేయడమేనన్నారు. అంతేకాక వారి ఆస్తులను దురాక్రమణ చేయడం, ఈ చట్టం ఉద్దేశ్యమన్నారు. దశాబ్దాల క్రితం ముస్లిములు ఇచ్చిన భూములు, ఆస్తులకు ఇప్పుడు డాక్యుమెంట్స్ అడగడం అసమంజసమన్నారు. ఇతర ధార్మిక సంస్థలలో ఇతర మతాల వారికి ప్రవేశం లేనప్పుడు ముస్లిం బోర్డుల్లో మాత్రం ఇతర మతస్తులను ఎందుకు చేర్చాలన్నారు. వక్ఫ్ సవరణ చట్టంకు మద్దతుగా చంద్రబాబు ఓటు వేసి ముస్లింల గొంతుకోసాడన్నారు. ఈ చట్టం రద్దు కోసం రాష్ట్రంలోనూ, దేశంలోనూ పెద్ద ఉద్యమం చేస్తామని చంద్రబాబు ప్రభుత్వం వక్ఫ్ భూములను 99ఏళ్లకు లీజుకు ఇవ్వడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా ముస్లిములు పోరాటంలోకి రావాలని పిలుపునిచ్చారు. వక్ఫ్ సవరణ చట్టం రద్దు అయ్యేంత వరకు వామపక్షాలు పోరాడుతాయన్నారు. ఈ పోరాటానికి ముస్లింలు, ప్రజాస్వామికవాదులు, మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాగరాజు, దర్గాబాబు, బోసు, ఎల్.శ్యామల, కృష్ణమోహన్, బి.కృష్ణయ్య, నర్సింహులు, తదితరులు ఉన్నారు.

'జెబి'లో క్రీడా దినోత్సవ వేడుకలు



మాట్లాడుతున్న టూరిజం డెవలప్‌మెంట్ చైర్మన్ నూకసాని బాలాజీ

ప్రజాశక్తి-కావలి : జవహర్ భారతి డిగ్రీ కళాశాల క్రీడా దినోత్సవం వేడుకలు శనివారం సాయంత్రం 5.30 గంటలకు కళాశాల ఆవరణలోని శంకరన్ హాల్‌లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి కళాశాల కరస్పాండెంట్ వి.సుధాకర్ రెడ్డి అధ్యక్షత వహించి, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, జవహర్ భారతిలోని విద్యార్థి కావాల్సిన అన్ని సదుపాయాలు, వసతులు, ప్రోత్సాహక వాతావరణం కళాశాలలో ఉన్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ నూకసాని బాలాజీ ప్రసంగిస్తూ జవహర్ భారతి, విశ్వోదయ ఆశయాలను, ఆదర్శాలను అందిపుచ్చుకొని జీవితంలో జవహర్ భారతి కళాశాల గురువుల నేర్పిన ఆ గొప్ప లక్షణాలను అన్వయించుకుని, జీవితంలో ఎది గానని, జీవనయానం సాగిస్తున్నానని విద్యార్థులకు తెలియజేశారు. ఇంకా ఆయన ప్రసంగిస్తూ క్రీడా విద్యార్థులు ఎదగడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో అవకాశాలను కల్పిస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం నాయుడు తమ సందేశంలో చదువుతో పాటు గేమ్స్, స్పోర్ట్స్‌లలో కూడా పాల్గొన్నట్లయితే విద్యార్థులలో ఆరోగ్యకరమైన పోటీ, స్నేహ, నాయకత్వ లక్షణాలు అలవడుతాయని తెలిపారు. జవహర్ భారతి డిగ్రీ కళాశాల స్వయం ఉపాధి కోర్సుల సంచాలకులు డాక్టర్ ఆర్.మాల్యాద్రి ప్రసంగిస్తూ, ఆటలలో గెలుపు ఓటములు అనివార్యమని ఆటల పోటీలలో పాల్గొనటమే ఎంతో ముఖ్యమని, జవహర్ భారతి కళాశాల క్రీడలకు పుట్టినిల్లు అని తెలియజేశారు. అనంతరం ఆటల పోటీలలో, ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ పి.ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. జవహర్ భారతి పూర్వ విద్యార్థి కృపారావు, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్తేర్ బ్యూలా, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని ఎంతో విజయవంతం చేశారు.

కూరపాటి కనకమ్మ మరణం

- సిపిఎం సంతాపం



ప్రజాశక్తి-కావలి : సిపిఎం మాజీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కూరపాటి జనార్దన్ పార్టీ గట్టి అభిమానులైన కూరపాటి ఉమాపతిరెడ్డి కోరపాటి కోటేశ్వర్ రెడ్డి అదే రకంగా వారి చెల్లెలు రాజామణి తల్లి కూరపాటి కనకమ్మ (94) ఏప్రిల్ 17న (గురువారం) గుడ్లూరు మండలం చిన్నలాటిరిపి గ్రామంలో చనిపోయారు. చనిపోయే ముందు కూడా పని చేసుకుంటూ హుషారుగా ఉండేది తమందరికీ ఇంటికొచ్చినప్పుడు ఆప్యాయంగా పలకరించేద తమందరికీ ఆతిథ్యం ఇచ్చేవారు ఆ అమరజీవికి సిపిఎం కావలి ప్రాంతీయ కమిటీ కావలి పట్టణ కమిటీ సంతాపం తెలియజేసింది. అదే రకంగా వాళ్ళ కుటుంబ సభ్యులకు బంధువులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రాంతీయ కమిటీ కన్వీనర్ గడ్డం మాల్యాద్రి, రావి మాల్యాద్రి, సిపిఎం సీనియర్ నాయకులు తాళ్లూరు మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి రాధాకృష్ణయ్య, కార్మిక సంఘం మండల అధ్యక్షులు పేముల సీతారామయ్య, కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు కే జాను, పట్టణ సిపిఎం కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య, ఎస్ వెంకయ్య, కందికట్టు నారాయణ, బోగోలు మండల నాయకులు తుమ్మల వెంకయ్య, చల్ల నరహరి, ఉపాధ్యాయ సంఘం నాయకులు శ్రీదేవి, తదితరులు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఎపిఒ బాధ్యతలు స్వీకరణ



ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో అదనపు ప్రోగ్రాం ఆఫీసర్ కె.శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి కొత్తగా విద్యా సంవత్సరం మొదలైంది కావున నూతన పనులను త్వరగా మొదలు పెడతామని తెలియజేశారు. రైతులు పొలాల్లో పంట కుంటలు ఏర్పాటు చేసుకోవాలని, మండలానికి గానూ 380 ఫారం ఫోమ్ ఏర్పాటు చేసుకుని వెసులుబాటు ఉందని కావున రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలియజేశారు. అదేవిధంగా ప్రతి ఇంటిలోనూ ఇంకుడు గుంటలు ఏర్పాటు చేసుకోవాలని, దానికి సంబంధించి వారి వ్యక్తిగత బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డు, పాన్ కార్డు, జాబ్‌కార్డు ఇవ్వాల్సి ఉంటుందని తదనంతరం ఇంకుడు గుంత నిర్మించిన తర్వాత రూ.6వేలు వారి అకౌంట్‌కే జమవుతాయని తెలియజేశారు. జాబ్‌కార్డు లేనిపక్షంలో ఆ ఏరియాలోని మేట్ ద్వారా, లేదా ఫీల్డ్ అసిస్టెంట్ ద్వారా కొత్తగా జాబ్ కార్డును మంజూరు చేయించుకోవచ్చని తెలిపారు.

పలుచోట్ల విపిఆర్ జన్మదిన వేడుకలు



విడవలూరులో..

ప్రజాశక్తి-విడవలూరు

నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జన్మదిన సందర్భంగా మండలంలోని రామతీర్థం గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు ఆవుల వాసు ఆవుల వాసు ఆధ్వర్యంలో ఆయన జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు కార్యకర్తలు మధ్య కేక్ కట్ చేసి విపిఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా ఆవుల వాసు మాట్లాడుతూ ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి రాజకీయాల్లోకి రాక ముందు తనసొంత నిధులతో పెద్దఎత్తున సేవా కార్యక్రమాల చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని వేల్పుల గుంట పంచాయతీలో టిడిపి మాజీ తెలుగు యువత అధ్యక్షులు ఏలూరి మాల్యాద్రి నాయుడు ఆధ్వర్యంలో నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఆ ఊరి గ్రామస్తుల నడుమ కేక్ కట్ చేసి, పిల్లలకు మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో వేల్పులగుంట సర్పంచ్ విజయలక్ష్మి, ఆ గ్రామ టిడిపి నాయకులు పత్తిపాటి వెంగయ్య నాయుడు కంచర్ల జనార్ధన్, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సంగం : స్థానిక పిఎసిఎస్ కార్యాలయంలో టిడిపి నాయకులు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, టిడిపి నాయకులు కర్నాటి రవీంద్రారెడ్డి, వెంగారెడ్డి పాలెం సర్పంచ్ ఆనంద్ ప్రసాద్ రెడ్డి, అన్నారెడ్డిపాలెం సాగునీటి సంఘం అధ్యక్షులు సూరా శ్రీనివాసులు రెడ్డి, బాణా శ్రీనివాసులు రెడ్డి, సంఘం సాగునీటి సంఘం అధ్యక్షుడు షేక్ బాబు, పట్టాభిరామి రెడ్డి, విజయ్ చంద్ర, కర్నాటి చరణ్ రెడ్డి, ఉక్కాల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మండలంలోని మైపాడు సముద్ర తీరంలో జన్మదిన వేడుకలు దువ్వూరు కళ్యాణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం విపిఆర్ చేసిన సేవా కార్యక్రమాలను సైకత శిల్పి ద్వారా ఇసుకతో శిల్పం చేసి సెల్ఫీలు దిగారు. అనంతరం టిడిపి నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి మాట్లాడుతూ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జన్మదినాన్ని మైపాడు గ్రామంలో ఘనంగా నిర్వహించిన దువ్వూరు కళ్యాణ్‌కుమార్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, వేమిరెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అల్లూరు : మండల పరిధిలోని ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంతరం ఏలూరు సుధాకర్ రెడ్డి, ఉటు శ్రీకాంత్, కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అంతరం అతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బండి శ్రీనివాసులు, అరగల రమణయ్య, పాపాల విజయ్ కుమార్, నజీర్, మునిరాజు, ఆట తిరుమల, రాజేంద్ర, కృష్ణచైతన్య, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఉదయగిరి : నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులకు మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చెంచలబాబు యాదవ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం తిరుపతి లోని తిరుచానూరులో పద్మావతి అమ్మవారి దేవస్థానంలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని కోవూరు ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డిని కలిసి జన్మదినశుభాకాంక్షలు తెలిపారు.

ప్రధానోపాధ్యాయుడికి అభినందనలు

ప్రజాశక్తి-ఉదయగిరి



పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన ప్రధానోపాధ్యాయులు నాయబ్‌ను ఎంఇఒ-2 తోట శ్రీనివాసులు సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఉన్నత పాఠశాల బిజ్జంపల్లిలో జరుగుతున్న వార్షికోత్సవంలో ఎంఇఒ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులుగా షేక్.నాయబ్ నియమితులు నుండి పాఠశాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని అభివృద్ధిలో భాగంగా పాఠశాల ప్రహరీ గోడ, విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కోసం ఆర్ఒ ప్లాంట్, సభా వేదిక నిర్మాణము, తదితర అభివృద్ధి పనులు వేగవంతంగా చేపట్టారని ప్రధాన ఉపాధ్యాయులు షేక్ నాయబ్‌ను సన్మానించి అభినందించారు. తదుపరి స్కూల్ కాంప్లెక్స్ నిధులతో పాఠశాల సముదాయ పరిధిలోని అన్ని పాఠశాలలకు ట్రంకు పెట్టె, ఫస్ట్ ఎయిడ్ కిట్, క్యారం, చెస్ బోర్డులు, కలర్ పెయింటెడ్ చార్ట్స్ తదితర వస్తువులు కలిగిన కిట్లను ఎంఇఒ చేతుల మీదుగా అందజేశారు. కాంప్లెక్స్‌లోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులకు, జిల్లా ఉన్నత పాఠశాల బిజ్జంపల్లి ఉపాధ్యాయుల అందరికీ మెమెంటోస్ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రమణమ్మ, మాజీ ఎంఇఒ ఓబుల్ రెడ్డి పాల్గొన్నారు.

బోగోలులో 'రన్ ఫర్ జీసస్'

ప్రజాశక్తి-బిట్రగుంట



గుడ్ ఫ్రైడే సందర్భంగా బోగోలు మండలం పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు శ్యామ్ సన్ బాబు శనివారం రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని ఇబ్రహీంపేట పెట్రోల్ బంకు వద్ద నుండి బోగోలు బజార్ అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 16 పంచాయతీల్లో ఉన్న చర్చిల పాస్టర్లు, మహిళలు, చిన్నపిల్లలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోగోలు మండలం పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ శ్యామ్ సన్ బాబు, రెవరెండ్ సి,హెచ్, నాగరాజు మాట్లాడుతూ గుడ్ ఫ్రైడేకు అర్థం ఏసుప్రభు శుక్రవారం చనిపోయి మూడవ దినం ఆదివారంనా తిరిగి లేగుస్తాడు అని, గుడ్ ఫ్రైడే కు నిదర్శనంగా శనివారం రోజు ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవ సోదరులు ఏసు కోసం పరుగు కార్యక్రమాన్ని జరుపుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్లు రెవరెండ్ రమేష్ బాబు, రెవరెండ్ ఎబినేజర్, రెవరెండ్ డాక్టర్ ఐజయ్య ,జీవన్ కుమార్, అబ్రహం, అద్భుత రాజ్, ఎల్ సుదీర్ బాబు, చంద్రహాస్, ఫిలిప్, డేవిడ్ పాల్, లాయర్ కెనడీ, పాస్టర్లు, సంఘ పెద్దలు, సంఘ కాపరులు, మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డుకిరువైపులా మట్టి వేయాలి

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండలంలోని స్థానిక ప్రభుత్వ వైద్యశాల, నుండి విజిఆర్ సుబ్బారెడ్డి మిల్లు దాకా కొత్తగా వేసిన రోడ్డుకు సైడ్ మట్టి వేయకుండా వదిలేసినారని గ్రామస్తులు, వైద్యశాలలో విధులు నిర్వహించే పలువురు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్పిటల్ నుంచి 108 అంబులెన్స్ వెళ్లే సమయంలో, పక్కన ఏ వాహనం సైడ్ ఇవ్వడానికి కూడా చాలా కష్టతరంగా మారుతుందని, ఎఎస్ఆర్ రెండు పెద్ద వాహనాలు ఎదురైనప్పుడు సైడ్ తీసుకోవడం కూడా కష్టంగా ఉంటుందని, అక్కడ పక్కనే కుప్పలు కుప్పలుగా మట్టి అయితే తోలి ఉన్నారు కానీ, ఆ మట్టిని సైడు వేయకుండా జాప్యం చేస్తున్నారని కావున ఈ విషయాన్ని ఇకనైనా కాంట్రాక్టర్లు, స్థానిక నాయకులు గమనించి ఆ మట్టిని సైడు రెండు వైపులా వేయాలని కోరుకుంటున్నారు.

పలుచోట్ల 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర'

ప్రజాశక్తి-కావలి

జవహర్ డిగ్రీ భారతి కళాశాలలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాల ప్రకారం ప్రతి నెలా మూడవ శనివారం జరిగే స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర (థీమ్: ఈ-వేస్ట్) కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 10.30 గంటలకు కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు సమావేశమై స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర ప్రతిజ్ఞ చేసి ఎలక్ట్రానిక్ వస్తువుల అపరిమిత వినియోగం వల్ల కలిగే అనర్థాలకు సంబంధించిన నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం నాయుడు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ గృహంలో, పరిసరాలలో నిరుపయోగంగా ఉన్న ఎలక్ట్రానిక్ వస్తువుల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ పి.నాగేశ్వరరావు, స్వయం ఉపాధి కోర్సుల డైరెక్టర్ డాక్టర్ ఆర్.మాల్యాద్రి, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆయుబ్ అహ్మద్, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్ కుమార్ రెడ్డి, జవహర్ భారతి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ వి.సుధాకర్ రెడ్డి విద్యార్థినీ విద్యార్థులను అభినందించారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : స్థానిక తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారు అనిల్‌కుమార్ యాదవ్, పోలీస్ స్టేషన్లో ఎస్ఐ శ్రీనివాసరావు శనివారం స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యాలయాల ఆవరణంలో ఉన్న చెత్తను, పిచ్చి మొక్కలను సిబ్బందితో కలిసి తొలగించారు. చెత్తను తొలగించిన అనంతరం చీపుర్లతో ఆవరణంను శుభ్రం చేశారు. కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : "స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర"లో భాగంగా ఎంఎల్ఎ దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, పురపాలక సంఘంలో కమిషనరు జి.శ్రావణ్ కుమార్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు పట్టణంలోని ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లో మానవహారం నిర్వహించి కమిషనర్ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు గ్రామపంచాయతీలో శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. సిబ్బంది తోటి ప్రతిజ్ఞ ర్యాలీ కార్యక్రమాన్ని చేపట్టారు. సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశాలు, గ్రామస్తులు, ఉపాధి కూలీలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సిఎం జన్మదిన వేడుకలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - ఉదయగిరి : మేకపాటి దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం జరిగే రాష్ట్ర ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలను విజయవంతం చేయాలని మాజీ ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, మేకపాటి శాంతికుమారి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 10:30 గంటలకు ఉదయగిరిలో మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి గెస్ట్ హౌస్ దగ్గర ఆర్‌టిసి దగ్గర ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నమని కావున అధిక సంఖ్యలో మహిళలు నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : స్థానిక ఎంఎల్ఎ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాల మేరకు టిడిపి జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదినం పురస్కరించుకొని ఘనంగా నిర్వహిస్తున్నట్లు టిడిపి నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని హజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబే రసూల్, దొరసానమ్మ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు జరిపి అనంతరం దర్గా నుండి ఎఎస్‌పేట బస్టాండ్ వరకు టిడిపి శ్రేణులు కార్యకర్తలు ర్యాలీగా వచ్చి స్థానిక బస్టాండ్ సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి, కేక్ కటింగ్ నిర్వహిస్తున్నామని మండల కన్వీనర్ అబ్బూరి రమేష్ నాయుడు తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల నుండి మండల స్థాయి నాయకులు, గ్రామస్థాయి నాయకులు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు, పాల్గొనాలని కోరారు.

ప్రజాశక్తి-వరికుంటపాడు : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన సందర్భంగా ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ఎంఎల్శ్రీ కాకర్ల సురేష్ ఆదేశాలతో మండల పార్టీ ఆధ్వర్యంలో స్థానిక వరికుంటపాడు బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు జన్మదిన వేడుకలు జరుగుతాయని టిడిపి మండల అధ్యక్షులు చంద్ర మధుసూదన్ రావు తెలిపారు. మండలంలోని తెలుగుదేశం, జనసేన, బిజెపిల ముఖ్యనాయకులు, టిడిపి గ్రామపార్టీ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జ్ లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమంను జయప్రదం చేయాలన్నారు.

సంగం బ్యారేజీ పరిశీలన

ప్రజాశక్తి-సంగం : సంగం బ్యారేజీను చీఫ్ ఇంజనీర్ వరప్రసాద్ రావు, ఎస్ఇ దేస్ నాయక్ శనివారం పరిశీలించారు. బ్యారేజీ వద్ద పెండింగ్‌లో ఉన్న పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇఇలు అనీల్ కుమార్ రెడ్డి, నాగరాజు, డిఇలు విజయరామి రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, పెంచలయ్య, ఎఇలు వినయ్, మల్లికార్జున, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ తరలింపు

- తహశీల్దార్‌కు బాధితుడు ఫిర్యాదు

ప్రజాశక్తి-దగదర్తి

మండలంలోని తిరువీధిపాడు గ్రామం సర్వే నెంబర్ 118లో సుమారు 90 ఎకరాల ఇనాం భూమిలో అక్రమంగా రాత్రుళ్లు గ్రావెల్ తరలిస్తున్నారని తహశీల్దార్ పి.కృష్ణకు భూ బాధితుడు ఎం.భక్తవత్సల రెడ్డి ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నెంబర్ 118లో సుమారు 90 ఎకరాల భూమికి ఇనామదారులైన మైలవరపు నరసింహారెడ్డి, అప్పలస్వామి దగ్గర నుండి తమ జేజి నానమ్మ అయినా మోపూరు సీతమ్మ కొనుగోలు చేశారని ఆయన తెలిపాడు. అప్పటి నుంచి ఆ భూముల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. గ్రావెల్ ఎర్ర బంగారం కావడంతో గ్రామంలోని అందరి పొలాల్లో గ్రావెల్ మాఫియా అక్రమంగా మట్టిని తరలిస్తూ డబ్బులు కూడ పెట్టుకుంటున్నారన్నారు. తమకు చెందిన సర్వేనెంబర్ 118లో 17వ తేదీ గురువారం రాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి వేళలో జెసిబి మిషన్లను తీసుకొచ్చి అక్రమంగా పంట పొలాల్లో గ్రావెల్ తరలిస్తున్నారని, తమకు సమాచారం అందడంతో వెంటనే సంబంధిత అధికారైన తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశామన్నారు. తమ భూముల్లో నుండి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న విషయమై స్థానిక ఎంఎల్ఎ దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరికి ఫిర్యాదు చేశామన్నారు. ఈ విషయంపై స్పందించిన వారు తహశీల్దార్‌కు ఫోన్ చేసి గ్రావెల్ అక్రమ తరలింపుపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. ఈ విషయమై స్పందించిన తహశీల్దార్ సంఘటన స్థలానికి రెవెన్యూ అధికారులు పంపించగా గ్రావెల్ తవ్వుతున్న జెసిబి అక్కడ నుంచి వెళ్లిపోయిందని తెలిపారు. హక్కుదారులకు తెలియకుండానే భూముల్లో రాత్రులు దొంగతనంగా గ్రావెల్ దోచుకు వెళ్లేందుకు నిర్ణయిస్తున్నారంటే అక్రమాలు ఏ మేరకు జరుగుతున్నాయో



గ్రావెల్‌కు ఎంత డిమాండ్ ఉందో తెలుస్తుందని మండల వాసులు పేర్కొంటున్నారు. మండలంలో రికార్డులు అందుబాటులో లేకపోవడం, ఉన్న రికార్డులు తప్పులు తడకగా ఉండడం గతంలో పనిచేసిన అధికారుల అక్రమాల కారణంగా రికార్డులు తారుమారై ఉండడంతోనే రాజకీయంగా, అంగ, అర్థబలం కలిగిన వ్యక్తులు ఈ తరహా అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.


అక్రమంగా గ్రావెల్ తరలిస్తే కఠిన చర్యలు : తహశీల్దార్



ఈ విషయమై తహశీల్దార్‌ను వివరణ కోరగా.. దగదర్తి మండల పరిధిలో ఎక్కడైనా గానీ ఎటువంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూములు కానీ డికెటి, సిజెఎఫ్ఎస్ భూములు గానీ అక్రమంగా గావెల్ తరలిస్తున్న సమాచారం అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వాహనాలను సీజ్ చేసి కేసుల నమోదుకు సిఫార్సు చేస్తామని తెలిపారు. దగదర్తి మండలం తిరువీధి పాడు భూముల్లో గ్రావెల్ తరలిస్తున్నారన్న సమాచారం తెలిసిన వెంటనే సంఘటన స్థలానికి తమ సిబ్బంది చేరుకొన్నారని అప్పటికే జెసిబిలు టిప్పర్లు వెళ్లిపోయాయని తెలిపారు.

చక్రపాణికి అభినందనలు

ప్రజాశక్తి - కావలి



సీనియర్ న్యాయ వాది ఏకగ్రీవంగా కావలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా అడ్వకేట్ చక్రపాణికి శనివారం బార్ అసోసియేషన్ ఛాంబర్లో అభినందనలుతో సత్కరించారు. లోక్ అదాలత్ సభ్యులు ఎం.మాలకొండా రెడ్డి మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో న్యాయ సేవలు అందిస్తున్న చక్రపాణి న్యాయవ్యవస్థకు వన్నె తేవాలని మాలకొండారెడ్డి కోరారు. ప్రజలకు న్యాయ సేవలు అందిస్తూ వృత్తిలో రాణిస్తున్న చక్రపాణి జీవితంలో ఎదగాలని కోరారు. కార్యక్రమంలో జయంపు కనకయ్య మధు తదితరులు కలిసి చక్రపాణిని బార్ అసోసియేషన్ ఛాంబర్లో వాళ్ళ సత్కరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

ప్రజాశక్తి-కోవూరు :ప్రభుత్వ పాఠశాలలో మంచి శిక్షణ పొందిన అర్హత కలిగిన ఉపాధ్యాయులచే విద్యార్థులకు నాణ్యమైన బోధన ఉంటుందని, ప్రభుత్వ పాఠశాలలను తల్లిదండ్రులు సద్విని యోగం చేసుకోవాలని ఎంఇఒ-2 వై.చెంచు లక్ష్మమ్మ అన్నారు. మండలం లోని లేగుంటపాడు గ్రామంలో శనివారం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేయడమే కాకుండా ప్రభుత్వ పాఠశాలలను ఉపయోగించు కోవాలని కోరుతూ తల్లిదండ్రులకు ఈ విషయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు, ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యా యులు ఉన్నారు.

శాంతిభద్రతలపై దృష్టి సారించండి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలుగుదే శం పార్టీ తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గం బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మన్నెం జితేంద్ర గౌడ్ విజ్ఞప్తి చేశారు. శ నివారం ఆయన కూటమి నాయకులతో కలసి స్థానిక పోలీస్ స్టేషన్ లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జితేంద్ర గౌడ్, జనసేన సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడులు మాట్లాడారు.

ఈకెవైసిపై ప్రత్యేక దృష్టి సారించాలి

ప్రజాశక్తి-కోవూరు:మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించి పెండింగ్లో ఉన్న ఈకెవైసిని ఈ నెలాఖరులోగా నూరుశాతం పూర్తిచేసేలా ఎండియు వాహన డ్రైవర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని తహశీల్దార్ నిర్మలానందబాబా అన్నారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో కోవూరు మండలంలోని డీలర్లు, ఎండీయూ వాహన డ్రైవర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవూరు మండలానికి సంబంధించి ఈకేవైసీ కార్యక్రమం మరింత వేగవంతం కావాలన్నారు. అదేవిధంగా ప్రతి నెల 1వ తేదిన రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని సక్రమంగా చేపట్టాల న్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ నాజర్, సీనియర్ అసిస్టెంట్ కిరణ్, తదితరులున్నారు.

కార్పొరేట్ల"కు ధీటుగా ప్రభుత్వ బడులు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశా లను తీర్చిదిద్దిందని ప్రధానోపాధ్యాయులు షేక్. అహ్మద్ బాషా పేర్కొన్నారు. మండలంలోని సౌత్ ఆములూరులో శనివారం బడి ఈడు పిల్లలు పాఠశాల లో నమోదు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హె చ్.ఎం అహ్మద్ బాషా మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశా లలకు ధీటుగా ప్రభుత్వ బడులలో అధునాతన సౌక ర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దాంతో తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రామంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ బడిలో చేర్పించి వారి భవిష్యత్తుకు బం గారు బాటలు వేయాలని సూచించారు. కార్యక్ర మంలో పాఠశాల చైర్మన్ ఆర్.సువార్త, వైస్ చైర్మ న్ వి. గిరిజ కుమారి ఉపాధ్యాయులు కె. వసంత లక్ష్మి, కె.హెప్సీ, విద్యుల్లత, బి. కృష్ణవేణి పాల్గొన్నారు.

తాగునీటిసమస్యకు శాశ్వత పరిష్కారం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

:మండలంలోని వరకవిపూడి పంచాయతీ శివరాంపురంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కా రం చూపుతామని టీడీపీ మండల కన్వీనర్ సన్నారెడ్డి సురేష్ రెడ్డి పేర్కొన్నారు. దెబ్బతిన్న శివరామపురం గిరి జన, బీసీ కాలనీలకు తాగునీటిని సరఫరా చేసే పైప్ లైన్ల మరమ్మతుల పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడుతూ శివ రామపురం గిరిజన కాలనీ, బీసీ కాలనీలో సరఫరా చేసే పురాతన పైప్ లైన్లు మరమ్మతులు కారణంగా నీరు నిలి చిపోవడంతో తాగునీటి సరఫరాకు అంతరాయం కలిగిందన్నారు. తాగునీటి సమస్యను ఎమ్మెల్యే, మాజీ మంత్రి చంద్రమోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, వెంటనే సోమిరెడ్డి స్పందించి నూతన పైప్ లైన్ ఏర్పా టుకు 39 లక్షలు రూపాయలు అంచనా విలువతో నిధు లు మంజూరు చేశారని చెప్పారు.

ఈ వేస్ట్ నిల్వతో పెనుముప్పు :కలెక్టర్

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : ఎలక్ట్రానిక్ ఉపకరణాల వ్యర్థాలు నిల్వ ఉండడం వలన పర్యావర ణానికి పెనుముప్పు ప్రమాద ముందని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. పట్టణ ంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నగర కమిషనర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించగా ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిత్యం తమ గృహాలలో ఉపయోగించే ఎలక్ట్రానిక్ పరికరాలు పాడైన తర్వాత అనేక రకాలైన హానికర రసాయనాలు వెలువడే ప్రమాదం ఉందన్నారు. ఈ కారణంగా కాలుష్యం పెరిగి పర్యావరణ సమతుల్యానికి హాని జరుగుతుం దన్నారు. యువత పరిసరాల పరిశుభ్రతతో పాటు ఈ వేస్ట్ పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. రీసైక్లింగ్ కేంద్రాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. రాష్ట్రాన్ని స్వచ్ఛ ఆంధ్ర గా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, పలువురు యువకులతో పాటు, పారిశుధ్య కార్మికులతో ఈ వేస్ట్ పై పలు సూచనలు చేశారు. అనంతరం ఎలక్ట్రానిక్ పరికరాలకు సంబంధించి న ఈ వేస్ట్ కలెక్షన్ సెంటర్ ను ఆయన సందర్శించి కమిషనర్‌ను వివరాలు అడిగి తెలుసుకొని ఈ వేస్ట్ స్టాక్ పాయింట్ పై ఆయనకు పలు సూచనలు తెలియజేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్ పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ చైర్మన్ పఠాన్ నస్రీన్ ఖాన్, పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

ప్రజాశక్తి-కలిగిరి :రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని పోలీసు అధికారులు శనివారం కలిగిరిలో అట్టహాసంగా నిర్వహించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, డ్వాక్రా సంఘాల మహిళలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఏపీ ట్రాన్స్‌కో సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహిం చారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు అన్ని శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోవూరు:కోవూరులోని పోలీస్టేషన్లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని పురస్కరిం చుకుని ట్రైనీ డీఎస్పీ శివప్రియ ఎలక్ట్రానిక్ వస్తువుల క్లీనింగ్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన చేసుకుని పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసులు, సిబ్బంది ఉన్నారు.

ప్రజాశక్తి కోవూరు:తమ ఇంటిలో పాడైపోయిన ఎలక్ట్రానిక్ వ్యర్థాల వలన గ్రామస్తులకు ఆరోగ్య సమస్యలు తలెత్తే పరిస్థితి వస్తుందని ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి తెలిపారు. కోవూరు పంచాయతీలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణఆంధ్ర కార్యక్ర మంలో భాగంగా కోవూరు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా పాడైపోయి ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాలను తమ ఇంట్లో ఉంచుకోవడం వలన వారికి అనేక ఇబ్బ ందులు తలెత్తే పరిస్థితి ఉంటుందన్నారు. దీనిని దష్టిలో పెట్టుకుని ప్రజలు అటువంటి వ్యర్థాలను ఉంచకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ప్రజల నుంచి ఈ వ్యర్థాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, పొదుపు మహిళలు, పారిశుధ్య కార్మికులు ఉన్నారు.

ప్రజాశక్తి-ఉలవపాడు:మండల కేంద్రంలో ఉలవపాడు గ్రామపంచాయతీ సచివా లయం ఒకటిలో శనివారం పంచాయతీ కార్యదర్శి వీరయ్య ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్ర మం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎంపీడీఓ విజయ, తహశీల్దార్ శ్రీనివాసులు, గ్రామ సర్పంచి మాణికల నాగలక్ష్మి పాల్గొని మాట్లాడారు. స్వర్ణాంధ్ర 2047 సంకల్పంలో భాగంగా ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు అందరూ పాల్గొని ఎక్కడెక్కడ చెత్త సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించడం జరిగి ంది. కార్యక్రమంలో కార్యదర్శి అజయ్ బాబు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ వార్డు సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించండి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

భవననిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఆ సం ఘం మండల అధ్యక్షులు అన్నం పుట్టయ్య డిమాండ్ చేశారు. భవన ని ర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం నరుకూరు సెంటర్ లో కర పత్రాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పుట్టయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వంలో భవన నిర్మాణ కార్మికులకు అమలవుతు న్న సంక్షేమ పథకాలను ఆపేస్తూ జీఓను జారీ చేసిందని తెలిపారు. గ త వైసిపి ప్రభుత్వం చేసిన ఘనకా ర్యం ఫలితంగా సంక్షేమ పథకాలు ఆగిపోయాయని విమర్శించారు. నాటి నుంచి నేటి వరకు ఒక్క కార్మికుడు కూడా సంక్షేమ పథకాలకు నోచుకోకుండా పోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వెంటనే భవన నిర్మాణ కార్మి కులకు సంక్షేమ బోర్డు పునరుద్ధరిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. ఈ మేరకు సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పత్రిక మీడియా సాక్షిగా హామీ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇవ్వ డమే కాకుండా ఎన్నికల మేనిఫెస్టో లో కూడా పొందుపరిచారని తెలిపారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తిగావస్తున్న నేటికీ ఇచ్చిన హామీలు అమలు చేయలేదని విమర్శించారు. భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను బి ల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డును తక్ష ణమే పునర్ధరించాలన్నారు. లేకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కరపత్రాల పంపిణీ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి మారు బోయిన రాజా పాల్గొని మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు వె ల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలన్నారు. గతంలో మంజూరు చేసి పెండింగ్లో ఉన్న క్లైముకు వెంటనే నిధులు చెల్లిం చాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అ మలు చేయాలనుకుంటున్నా భవన నిర్మాణ కార్మికులకు నష్టదాయకమై న లేబర్ కోర్సును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అ ర్హులైన భవన నిర్మాణ కార్మికులకు గృహ నిర్మాణాలకు వెల్ఫేర్ బోర్డు ద్వారా సబ్సిడీతో కూడిన రుణం ఇవ్వాలన్నారు. ఇతర రాష్ట్రాలలో అమలవుతున్నట్లుగా భవన నిర్మా ణ కార్మికులకు మెరుగైన సంక్షేమ ప థకాలు అమలు చేయాలని తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్ ఇవ్వాలని, ని ర్మాణాలలో ఉపయోగించే వస్తువు లపై జిఎస్‌టి తగ్గించాలని, కార్మికుల కోసం వేచి ఉండే అడ్డాలలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నరుకూరు సెంటర్ ఆటో యూనియన్ కార్యదర్శి ఆరణి గోపి, బాషా, ఎల్లి గోపి, నిర్మాణ మేస్త్రిలు ఎస్.కె బాబు, తా తా వెంకటేశ్వర్లు, భవన నిర్మాణ కా ర్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నా రు.

21న సబ్ కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-ఉలవపాడు

ఈనెల 21వ తేదీ సోమవారం కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సోలార్, భారత్ పెట్రోలియం పరిశ్రమల కోసం భూసేకరణ చేస్తున్న ప్రభుత్వ చర్యలకు నిరసనగా కరేడు గ్రామ ప్రజలు ధర్నా నిర్వహిస్తున్నట్లు కరేడు మాజీ ఎంపీటీసీ సభ్యుడు మిరియం శ్రీనివాసులు తెలిపారు. ఈ ధర్నాకు ప్రజాస్వామ్యవాదులు, విద్యార్థి, యువజన సంఘాలు మద్దతు తెలియజేయాలని తెలిపారు. రైతులకు అండగా అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలపాలని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల జీవితాలతో చెలగాటమాడొద్దని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో ప్రజా ఆందోళన కార్యక్రమాలు భారీ స్థాయిలో నిర్వహిస్తామని తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమంలో అందరూ భారీ ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు.

క్రీడాకారులు ఎంపిక

ప్రజాశక్తి-కోవూరు

మండలంలోని పాటూరు జిల్లా పరిషత్ క్రీడా ప్రాంగణంలో శనివారం సబ్ జూనియర్స్ షూటింగ్ బాల్ క్రీడాకారుల ఎంపిక నిర్వహిం చారు. ఈ సందర్భంగా షూటింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బీమతాటి వెంకటరమణయ్య మాట్లాడుతూ ఇక్కడ ఎంపికైన నెల్లూరు జిల్లా క్రీడాకారుల జట్టు మంచి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఇక్కడ ఎంపికైన 7 క్రీడా కారులు ఈ నెల 26.27 తేదీల్లో అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ప్రధానో పాధ్యాయులు జి. వెంకటేశ్వర్లు నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పర్వతరెడ్డి జనార్ధన్‌రెడ్డి, సంక్షేమాధికారి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో విద్యార్థులు ఉన్న దృశ్యం

విద్యార్థులు బంగారు భవిష్యత్తు వైపు అడుగులేయాలి

ప్రజాశక్తి-కోవూరు

జరిగిన విద్యా సంవత్సరానికి సంబందించిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో కోవూరు టిఎన్‌సి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయ్ దుందుభి మోగించారని ఆకళాలశాల ప్రిన్సిపల్ షేక్ సికిందర్ బాషా తెలిపారు.కళాశాల ఆవరణలో శనివారం జరిగిన అభినందన సభ కార్యక్రమంలో అయన మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు బైపిసి గ్రూప్ 972/1000 పి. సమీర ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. మా కళాశాల మార్కులే కాదు, విద్యార్థుల విలువలు నేర్పించడం జరిగిందని తెలిపారు.విద్యార్థులకు అవసరమైన సూచనలు సలహాలు ఇంగ్లీష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటని, జువాలజీ అధ్యాపకులను అభినంది ంచారు . కళాశాల సగటు ఉత్తీర్ణ శాతం 80శాతం అని, క్రమశిక్షణతో కూడిన భోదన వల్ల ఇది సాధ్యమైనదని తెలిపారు. సినియర్ ఇంటర్ లో 900/1000 పైన మార్కులు సాధించిన 6 గురు విద్యార్థులు, జూనియర్ ఇంటర్‌లో 400/470 పైన సాధించిన 10 మంది విద్యార్థులను పూల బోకెలతో సన్మానించారు.ఎంపిసి విభాగంలో 933 మార్కులు సాధించిన రహమతిన్నిస్సా బైపిసిలో 972 సాధించినందుకు ప్రిన్స్‌పల్ సికిందర్ సొంత నిధులలో 5000/- బహుమతిగా అందించారు .

జూనియర్ ఇంటర్ లో అత్యదిక మార్కులు సాదించిన షేక్ ఇమ్రాన్ 479, శార జాస్మిన్440,కెవి రమణమ్మ 433/470 లను ప్రత్సేకంగా అభినందించారు . వచ్చే సం ము ఏ కోర్సులు చేరాలి అనే దాని పైన కౌన్సెలింగ్ ఇవ్వడం జరిగిందని . ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులను 24 వ తేది నుండి రెమిడియల్ క్లాసులు నిర్వహిస్తామని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవా లన్నారు. వృత్తి విద్యాశాఖాధికారి మధుబాబు మాట్లాడుతూ కళాశాల గత 5 సం లుగా మంచి ఫలితాలు సాధిస్తుందన్నారు. అందుకనే ఈ కళాలలో స్కిల్ హబ్ కూడా మంజూరైందన్నారు. న్యాయకత్వ లక్షణలు కలిగిన వ్యక్తి మీకు ప్రిన్స్‌పల్ గా ఉన్నారని ఇంజి నీరింగ్ లాంటి కోర్సులే కాకుండా నూతన కోర్సులలో విద్యార్థులు చేరాలన్నారు. కార్యక్రమంలో అద్యా పకులు, అద్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.